బెల్లంపల్లి శాంతిఖని పాఠశాలలో...



మందమర్రి సింగరేణి హైస్కూల్లో...



రాంపూర్ ఆవాస విద్యాలయంలో...



శ్రీరాంపూర్: సాందీపని పాఠశాలలో..





మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాలలో...

అ'పూర్వ'ం.. ఆత్మీయం

రామకృష్ణాపూర్/బెల్లంపల్లి/శ్రీరాంపూర్/మంచిర్యాలఅర్బన్/మంచిర్యాల రూరల్(హాజీపూర్): వారంతా చిన్ననాటి స్నేహితులు.. కలిసి ఆడిపాడారు.. పదో తరగతి వరకు చదువుకున్నారు.. ఉన్నత చదువుల కోసం తలోదారి పట్టారు. ఇంకేముంది అంతా దూరమయ్యారు.. అలా దూరమైన అలనాటి బాల్యమిత్రులు ఆదివారం పూర్వ విద్యార్థులుగా కలుసుకున్నారు. అల్లరిని గుర్తు చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ఆప్యాయ పలకరింపులు.. నవ్వులు.. చిలిపి చేష్టల జ్ఞాపకాలతో బాల్యమిత్రుల సంతోషాలకు అవధుల్లేకుండా పోయాయి. ఈ ఆనందానికి.. పట్టరాని సంతోషానికి వేదికగా నిలిచాయి ఆనాటి పాఠశాలలు.

- మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం పడ్తనపల్లిలోని రాంపూర్ శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో 1999–2000 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 25ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులు ఆహ్వానించి సన్మానం చేశారు.
- రామకృష్ణాపూర్, మందమర్రి సింగరేణి హైస్కూళ్లకు చెందిన 1991–92బ్యాచ్ విద్యార్థులు 33 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. మంచిర్యాలలోని రెండు ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లు వేదికయ్యాయి.
- శ్రీరాంపూర్‌లోని సాందీపని స్కూల్ 2008–09 బ్యాచ్ విద్యార్థులు పట్టణంలోని ఓ రిసార్టులో కలుసుకున్నారు.
- మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాల 2001–2002 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అదే పాఠశాలలో కలుసుకున్నారు. చిన్ననాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు.
- బెల్లంపల్లి శాంతిఖని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 1980–81 విద్యా సంవత్సరంలో ఏడో తరగతి చదివిన విద్యార్థులు నాలుగున్నర దశాబ్దాల తర్వాత ఒకటోట కలిసి అన్యోన్యంగా ఆత్మీయతలను పంచుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ప్రస్తుతం ఎక్కడ ఉంటున్నారు, ఏం చేస్తున్నారో పరస్పరం ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకొని కొందరు విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను శాలువతో సన్మానం చేశారు.



రామకృష్ణాపూర్ సింగరేణి హైస్కూల్లో...

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్‌ను (త్రైతశకం –47) ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖలు ఆవిష్కరించారు. త్రైత శకం తెలుగు క్యాలెండర్‌ను పలువురికి వితరణ చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి సభ్యులు రాజు, లావణ్య, వేణు, నాగిరెడ్డి, రవళి, అనుతేజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



పతాకావిష్కరణలో టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, చదువులో అంతరాలు పోవాలంటే ప్రభుత్వ బడులతోనే సాధ్యమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి అన్నారు. స్థానిక యూనియన్ కార్యాలయం వద్ద ఆదివారం ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో పనిచేస్తున్న ఉపాధ్యాయ సంఘం టీఎస్‌యూటీఎఫ్ అన్నారు. ప్రభుత్వ విద్య అభివృద్ధి ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల కోసం నిరంతరం పోరుడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావేణు, ఉపాధ్యక్షుడు కిరణ్, జిల్లా కార్యదర్శులు చంద్రమౌళి, నర్సయ్య, కమిటీ సభ్యులు శ్రీధర్, కృష్ణమూర్తి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

లక్సెట్టిపేట: మండలంలోని తిమ్మాపూర్, వెంకట్రావుపేట, పట్టణంలోని మార్కెట్ యార్డుల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తెలంగాణ రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి ఆదివారం ప్రారంభించారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని, దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేంకుమార్, వైస్ చైర్మన్ ఎండీ ఆరీఫ్, తహసీల్దార్ దిలీప్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- డీసీసీ అధ్యక్షురాలు సురేఖ



దండేపల్లిలో ప్రతిజ్ఞ చేపిస్తున్న సురేఖ

దండేపల్లి: దేశ స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. దండేపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. రాజ్యాంగం పై ప్రతిజ్ఞ చేయించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అక్కల వెంకటేశ్వర్లు, కంది సతీష్, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జై భీం అనే అర్హత కాంగ్రెస్‌కు లేదు

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న పాల్వాయి హరీశ్‌బాబు, వెంకటేశ్వర్‌గౌడ్, రఘునాథ్

నస్పూర్: డా. బీఆర్ అంబేడ్కర్ జీవించి ఉన్నన్ని రోజులు ఆయనను ఎన్నో విధాలుగా అవమానించిన కాంగ్రెస్‌కు జై భీం అనే అర్హత లేదని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నస్పూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సీసీసీ కార్నర్‌లోని అంబేడ్కర్ విగ్రహాన్ని జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌తో కలిసి శుద్ధి చేశారు. అనంతరం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా జై భీం, జై బాపు, సంవిధాన్ అంటూ కాంగ్రెస్ నాయకులు వీధుల్లో తిరుగుతూ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. బీజేపీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని, రాజ్యాంగాన్ని సవరిస్తుందని అసత్యపు ఆరోపణలు చేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల అభ్యున్నతికి బీజేపీ ఎనలేని కృషి చేస్తుందని తెలిపారు. రఘునాథ్ మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలోని అండాలమ్మ కాలనీలో చెత్త డంప్‌యార్డును తరలించడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలం అయ్యారన్నారు. వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. నేడు జిల్లా వ్యాప్తంగా అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం అశోక్, కొయ్యల ఏమాజి, శ్రీదేవి, గాజుల ముకేష్‌గౌడ్, సత్రం రమేశ్, కట్కూరి సతీష్‌కుమార్, మిట్టపల్లి మొగిలి, పొన్నవేని సదానందం తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ప్రదర్శనలో బీజేపీ నాయకులు

చెన్నూర్: అన్ని వర్గాల జీవితాల్లో వెలుగునింపిన అంబేడ్కర్‌ను స్మరించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరి పై ఉందని బీజేపీ జిల్లా కార్యదర్శి దుర్గం అశోక్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని స్థానిక అంబేడ్కర్ విగ్రహ పరిసర ప్రాంతంలో బీజేపీ ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. అనంతరం రాజ్యాంగాన్ని రాసి అన్ని వర్గాల జీవితాల్లో వెలుగు నింపిన అంబేడ్కర్ కోసం కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, బత్తుల సమ్మయ్య, తుమ్మ శ్రీపాల్, మంత్రి రామయ్య, కేవీఎం శ్రీనివాస్, కొండపాక చారిలు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువు పొడిగించాలి



మాట్లాడుతున్న ప్రసాద్

బెల్లంపల్లి: రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పి.వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎంసీపీఐ(యూ)పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఆన్‌లైన్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యల వల్ల అర్హులైన అనేక మంది కుల, నివాస, ఆదాయ ధృవీకరణ పత్రాలు పొందలేకపోయారని తెలిపారు. నిరుపేదలైన యువకులు దరఖాస్తు చేసుకోలేక సతమతమవుతున్నారని పేర్కొన్నారు. వీరికి అవకాశం కల్పించడానికి మరోసారి దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించాలని సూచించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క బెల్లంపల్లిలోనూ పర్యటించాలని, సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంసీపీఐ(యూ) శ్రేణులు పాల్గొన్నారు.

రెడ్డి కులస్తుల సంక్షేమం కోసం కృషి



రెడ్డి కుల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు

పాతమంచిర్యాల: రెడ్డి కుల సంక్షేమ కోసం కృషి చేస్తానని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన గుర్రం మోహన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సురభి ఫంక్షన్ హాల్లో ఆదివారం రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుర్రం మోహన్‌రెడ్డి(జన్నారం), ప్రధాన కార్యదర్శిగా నరహరి శ్రీధర్‌రెడ్డి(మంచిర్యాల), ఉపాధ్యక్షులుగా మద్దుల మనోహర్‌రెడ్డి (మంచిర్యాల), హన్మాండ్ల వెంకట్‌రెడ్డి (శ్రీరాంపూర్), సంయుక్త కార్యదర్శులుగా గొట్లం తిరుపతిరెడ్డి, గూడ జనార్దన్‌రెడ్డి, చెరుకు తిరుపతి రెడ్డి, కోశాధికారిగా బండ అమర్నాథ్‌రెడ్డి, సలహాదారులుగా కేతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, న్యాయసలహాదారులుగా నాగిరెడ్డి మల్లారెడ్డి, మరో ఏడు మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మిలిటరీ స్కూల్‌కు ఎంపిక

కోటపల్లి: రాపన్‌పల్లి గ్రామానికి చెందిన గుర్రం సమ్మయ్య–రాణి దంపతుల కుమారుడు ఆకాశ్ పటేల్ రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన రాష్ట్రీయ మిలిటరీ స్కూల్‌కు ఎంపికయ్యాడు. విద్యార్థిని కలెక్టర్ కుమార్‌దీపక్ తన చాంబర్‌లో అభినందించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

జన్నారం: నామినేట్ పదవుల కేటాయింపులో నేతకాని కులస్తులకు పెద్దపీట వేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను జన్నారంకు చెందిన నేతకాని సంఘం నాయకులు ఉట్నూర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ జన్నారం ఏఎంసీ చైర్మన్ పదవి దుర్గం లక్ష్మీనారాయణ, ఆదిలాబాద్ ఆర్టీఏ సభ్యుడిగా ఉట్నూర్‌కు చెందిన దూట రాజేశ్వర్‌ను నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. జనాభా ప్రకారం నేతకానీలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఆర్టీఏ సభ్యుడు రాజేశ్వర్, నాయకులు జాడి వెంకటయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కళాక్షేత్ర విద్యార్థుల గజ్జెపూజ

జన్నారం: మండల కేంద్రంలోని నటరాజ కళాక్షేత్రంలో నృత్యం నేర్చుకున్న విద్యార్థులు ఆదివారం రామాలయంలో గజ్జెపూజ నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, సుధాకర్, రాజేశ్వర్, కాంతయ్య సమక్షంలో గజ్జెపూజ చేసి మాస్టర్ నర్మదగౌడ్‌ను పూలమాలలతో సన్మానించారు.

దేశీదారు పట్టివేత

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో అక్రమంగా అమ్ముతున్న దేశిదారు మద్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. టూ టౌన్ ఎస్సై కె.మహేందర్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఓ మహిళ అక్రమంగా దేశీదారు మద్యాన్ని కలిగి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు స్పందించిన టూ టౌన్ ఎస్సై మహేందర్ సిబ్బందితో కలిసి వెళ్లి బెల్లంపల్లి హనుమాన్ బస్తీకి చెందిన కోట సారమ్మ అనే మహిళ వద్ద నుంచి తొమ్మిది లీటర్ల దేశిదారు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితురాలు సారమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమరవాణా అరికట్టాలి

జన్నారం: వ్యవసాయానికి సంబంధించిన రవాణ పారదర్శకంగా ఉండేలా, వ్యవసాయ ఉత్పత్తుల అక్రమ రవాణాను అరికట్టేలా చూడాలని జన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ఇందన్‌పల్లి గ్రామం వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును ఆదివారం ఆయన సందర్శించారు. రికార్డులు, వాహనాల వివరాల నమోదు, రశీదులు పరిశీలించారు.

రథోత్సవ పూజలు

చెన్నూర్: చెన్నూర్ జగన్నాథాలయ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో రథోత్సవ పూజకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ అర్చకులు దామెర మోహనాచార్యులు మాట్లాడుతూ.. ఏటా శ్రీరామ నవమి తర్వాత రథోత్సవంలో సాలగ్రామల పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

జన్నారం: మండలంలో ఆదివారం కురిసిన అకాల వర్షంతో కవ్వాల్ గ్రామంలో పలువురు రైతుల వరి ధాన్యం తడిసింది. రోజంతా ఎండ దంచి కొట్టి మధ్యాహ్నం మూడు గంటల సమయంలో రాళ్లవాన కురిసింది. వర్షంతో నేతకాని గూడెం, కవ్వాల్ పారంపల్లి ప్రాంతాల్లో కల్లాల్లోని ధాన్యం తడిసింది. కలమడుగు, మొర్రిగూడ, మురిమడు గు, ఇందన్‌పల్లి గ్రామాల్లోనూ ధాన్యం తడిసింది.

ఘనంగా మట్టల ఆదివారం



మన్నా చర్చిలో మట్టలతో క్రైస్తవులు



ఈత మట్టలతో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

రామకృష్ణాపూర్: మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని సీఎస్ఐ సెయింట్ పీటర్స్ చర్చి ఆధ్వర్యంలో కార్మికవాడల్లో మట్టలతో ర్యాలీ చేపట్టారు. చర్చి నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆంధ్రాబ్యాంక్ మీదుగా ప్రధాన కూడళ్ల గుండా సాగింది. క్రైస్తవ భక్తి గీతాలను ఆలపిస్తూ ఖర్జూరపు మట్టలను ఊపుతూ ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు. చర్చిలో జరిగిన ప్రత్యేక ఆరాధనలో పాస్టర్ ఎం.జాషువా దైవసందేశాన్ని అందించారు. మన్నా చర్చిలో జరిగిన ఆరాధనలో పాస్టర్ సీహెచ్.జాషువా దైవసందేశాన్నిచ్చారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని కర్ణమామిడి చర్చిలో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు భక్తులకు సందేశాలు ఇచ్చారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి సీఎస్ఐ చర్చి సారధ్యంలో మట్టల ఆదివారాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సామూహికంగా తరలివచ్చిన క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు ముగిశాక పుర వీధుల్లో ఈత మట్టలు చేతబట్టుకొని ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి ప్రెజిబీటర్ ఇన్‌చార్జి సీ.హెచ్ అశోక్, సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

భీమారం: మండలకేంద్రంలోని క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారంను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. వీధులగుండా పాటలు పాడుతూ మట్టలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ బంటు జెర్మియ ప్రారంభించగా వందలాది క్రీస్తు విశ్వాసులు మార్కెట్ పురవీధుల గుండా ఈత మట్టలు చేతపట్టుకొని, పాటలు పాడుతూ ఊరేగింపుగా ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు, క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక అధికారులు

చెన్నూర్: అగ్ని ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ నెల 14 నుంచి 20వరకు దేశ వ్యాప్తంగా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఫైర్ స్టేషన్ అధికారి సంపత్‌కుమార్ తెలిపారు. వారోత్సవాల సందర్భంగా పట్టణ ప్రధాన వీధుల్లో ప్రమాద నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రజలు వారోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

బెల్లంపల్లి: అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏటా నిర్వహిస్తున్న మాదిరిగానే ఈ నెల 14నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు జరగనున్నాయి. ఈ వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత, ముందస్తు నివారణ చర్యలు, మంటలను ఆర్పే విధానాలను ప్రజలకు వివరించనున్నారు. బెల్లంపల్లి అగ్నిమాపక కేంద్రం పరిధిలో వారోత్సవాల నిర్వహణ కోసం అగ్నిమాపక సిబ్బంది సర్వం సిద్ధం చేశారు.

ఖాళీ బిందెలతో బతుకమ్మ ఆడి నిరసన



చెన్నూర్‌రూరల్: మండలంలోని వెంకంపేట గ్రామంలోని దుబ్బగూడెం కాలనీలో నెలరోజుల క్రితం బోరుకు అమర్చిన విద్యుత్ మోటార్ కాలిపోయింది. దీంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరూ పట్టించుకోక పోవడంతో ఆదివారం మహిళలు ఖాళీ బిందెలను మధ్యలో ఉంచి బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు పట్టించుకొని తాగునీటి తిప్పలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

పాఠ్యపుస్తకాలలో జార్జిరెడ్డి జీవిత చరిత్రను పొందుపర్చాలి

మంచిర్యాలఅర్బన్: పాఠ్యపుస్తకాలలో జార్జిరెడ్డి జీవిత చరిత్ర పొందుపర్చాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆదివారం కామ్రేడ్ జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సికిందర్, నాయకులు శశికుమార్, మధు, మోహన్, నిరాజ్ పాల్గొన్నారు.

యూనిఫాం కోసం క్లాత్ అందజేత

భీమారం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డ్రెస్‌లు అందించేందుకు ఐకేపీ మహిళలకు ఆదివారం ఎంఈవో వేణుగోపాల్ క్లాత్ అందజేశారు. నిర్ణీత సమయానికి డ్రెస్‌లు అందించాలని వారిని కోరారు. ఏపీఎం త్రియంబక్, సీఆర్పీ సాగర్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

పాతమంచిర్యాల: రాముని చెరువు వాకర్స్ నూతన కమిటీని జిల్లా కేంద్రంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొగిలి తిరుపతి, గౌరవ అధ్యక్షులుగా కనుకుట్ల మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్, కోశాధికారిగా ప్రవీణ్‌లను ఎన్నుకున్నా రు. రామునిచెరువు కట్టపై వాకర్స్ కోసం అన్ని వసతులు కల్పించడానికి కృషి చేస్తాన్నారు.

ఎస్సీ యూత్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల యూత్ కమిటీని ఎన్నుకున్నారు. శ్రీరాంపూర్‌లోని గణేశ్‌నగర్‌లో ఆదివారం జరిగిన యూత్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షుడిగా శ్రీరాంపూర్‌కు చెందిన వేముల స్వామి, 4వ వార్డు ఇన్‌చార్జిగా కొటం కృష్ణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నర్సింగ్, నియోజకవర్గం ఇన్‌చార్జిగా గుమ్మడి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులుగా తలారి రాజు, నాయకులు మామిడి రాజు, వేముల మల్లమ్మ, ప్రజ్వల్, జశ్వంత్‌లు పాల్గొన్నారు.

రజతోత్సవ సభ విజయవంతం చేయండి

మందమర్రిరూరల్: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను బీఆర్ఎస్, అనుబంధ సంఘాల నేతలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మార్కెట్ ఏరియాలో గల టీబీజీకేఎస్ ఆఫీస్‌లో ఆదివారం సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.